www.prajasakti.com

ప్రజాశక్తి

బుధవారం 27 నవంబర్ 2024

5

తూర్పుగోదావరి



సీతానగరం వ్యవసాయ అధికారి సస్పెన్షన్

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

సీతానగరం మండల వ్యవసాయ అధికారి కె.సూర్యరమేష్‌ను సస్పెండ్ చేస్తూ కలెక్టర్ పి.ప్రశాంతి మంగళవారం ఆదేశాలు జారీ చేశారు. కోరుకొండ, సీతానగరం, రాజానగరం మండలాలకు చెందిన రైతులు ఖరీఫ్ సీజన్లో సాగు చేసిన ధాన్యాన్ని ఏ కేంద్రానికి అమ్ముకోవాలో తెలియక ఆకాశమున్నప్పటికీ, స్థానికంగా ఉన్న మిల్లులకు మాత్రమే పంపి కోవాలని అనధికారికంగా కలెక్టర్ పి.ప్రశాంతి పేరుతో ప్రకటనను సామాజిక మాధ్యమాల్లో ఎఒ పేరుతో వైరల్ అయ్యింది. కలెక్టర్ అధికారికంగా ప్రకటించిన కథనాలను సామాజిక మాధ్యమాల్లో ప్రచారం చేయడాన్ని తీవ్రంగా పరిగణించి ఎఒను సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు ఇచ్చారు. ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నందున అధికారిక ప్రకటనలను విడుదల చేసే ముందు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.

మోడీ నిరంకుశ పాలనపై

కదం తొక్కిన కార్మిక, రైతు సంఘాలు

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం ప్రతినిధి

కేంద్రంలోని మోడీ నిరంకుశ పాలన, ప్రజా వ్యతిరేక విధానాలపై కేంద్ర కార్మిక సంఘాలు, రైతు సంఘాలు, వ్యవసాయ శ్రేణులు కదం తొక్కాయి. 10 కేంద్ర కార్మిక సంఘాలు, 500 రైతు సంఘాలు సంయుక్తంగా ఇచ్చిన దేశవ్యాప్త పిలుపులో భాగంగా రాజమహేంద్రవరం కోటిపల్లి బస్టాండ్ నుంచి కోటగుమ్మం వరకు భారీ ర్యాలీ నిర్వహించాయి. పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలని, కనీస వేతనం రూ.26వేలు చేయాలని, కార్పొరేట్ అనుకూల విధానాలు నశించాలని పెద్ద ఎత్తున నినదించారు.

ఈ సందర్భంగా జరిగిన సభకు సిఐటియు జిల్లా అధ్యక్షులు ఎం.సుందర్‌బాబు అధ్యక్షత వహించారు. సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు టి.అరుణ్, ఎఐటియుసి రాష్ట్ర ఉపాధ్యక్షులు వి.కొండలరావు, ఐఎఫ్‌టియు జిల్లా అధ్యక్షులు కె.జోజి, ఇఫ్టూ జిల్లా నాయకులు వీఙ్ఞ వెంకటేశ్వరరావు మాట్లాడారు. పెట్టుబడిపై 50శాతం అదనంగా నిర్ణయించి గిట్టుబాటు ధరను ప్రకటించాలని, ఈ మేరకు చట్టం చేయాలన్నారు. ఏ రంగంలో పనిచేసే కార్మికుడికైనా కనీస వేతనాన్ని రూ.26 వేలుగా నిర్ణయించాలన్నారు. 60 ఏళ్ల పనిచేసే రిటైర్ అయిన వారికి రూ.9 వేలు కనీస పెన్షన్ చెల్లించాలన్నారు. ఆటో, హమాలీ, ట్రాన్స్‌పోర్ట్, భవన నిర్మాణ కార్మికులకు సామాజిక భద్రత కల్పించే చట్టాలను అమలు చేయాలన్నారు. అంగన్‌వాడీ, ఆశ, మిడ్డే మీల్స్, నేషనల్ హెల్త్ మిషన్, సమగ్ర శిక్ష ఉద్యోగులను, కార్మికులను రెగ్యులర్ చేయాలన్నారు. గ్రాట్యుటీ, పెన్షన్, రిటైర్మెంట్ బెనిఫిట్స్ కల్పించాలని డిమాండ్ చేశారు. విశాఖ స్టీల్ ప్లాంట్, రైల్వే తదితర ప్రభుత్వ రంగ సంస్థల ప్రయివేటీకరణను తక్షణం నిలిపివేయాలన్నారు. ప్రజలపై విద్యుత్ భారాలు వేసే 2023 విద్యుత్ చట్టాన్ని రద్దు చేయాలన్నారు. అత్యవసర మందులపై జిఎస్‌టిని ఎత్తి వేయాలన్నారు. ధరలు తగ్గించేందుకు పెట్రోల్, డీజిల్‌లపై పన్నులను తగ్గించాలన్నారు. కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని, అప్పటివరకు సమాన పనికి సమాన వేతనాన్ని సుప్రీంకోర్టు తీర్పు మేరకు అమలు చేయాలన్నారు. అదానీతో రాష్ట్ర ప్రభుత్వం చేసుకున్న ఒప్పందాలను అన్నీ రద్దు చేసుకోవాలన్నారు. స్మార్ట్ మీటర్ల బిగింపును తక్షణం నిలుపుదల చేయాలని, పరిశ్రమల్లో ప్రమాదాల నివారణకు రెగ్యులర్‌గా సేఫ్టీ ఆడిట్లు నిర్వహించాలన్నారు. మూసివేసిన పరిశ్రమలను తెరిపించి కార్మికులకు ఉపాధి కల్పించాలన్నారు. ఎన్నికల హామీ మేరకు వాలంటీర్లందరినీ కొనసాగించి రూ.10వేల వేతనం చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు ఎస్ఎస్.మూర్తి, జిల్లా సహాయ కార్యదర్శి కె.రామకృష్ణ, బి.పూర్ణిమరాజు జిల్లా నాయకులు బి.పవన్, ఎఐటియుసి నాయకులు కె.రాంబాబు, తాటిపాక మధు, రైతు సంఘం కార్యదర్శి కె.జ్యోతిరాజు, ఎపి రైతు సంఘం జిల్లా కార్యదర్శి గారపాటి వెంకట సుబ్బారావు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి తోట లక్ష్మణరావు, కార్మిక మహిళా పోలం నాయకులు లావణ్య, ఎపి అంగన్‌వాడీ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి వై.బేబీరాణి, ఎపి ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.వెంకటలక్ష్మి, జిల్లా గ్యాస్ వర్కర్స్ యూనియన్ కార్యదర్శి గంటి కృష్ణ, తూర్పుగోదావరి జిల్లా బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు వల్లేపల్లి నరసింహమూర్తి, పెన్షనర్ అసోసియేషన్ నాయకులు సిహెచ్.మోహనరావు, కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి జువ్వల రాంబాబు, ఐద్వా జిల్లా కార్యదర్శి పి.తులసి, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు వై.భాస్కర్, ఎస్.రాజా, డివైఎఫ్ఐ జిల్లా కన్వీనర్ పి.రాంబాబు, జోసఫ్, జట్టు కార్మిక సంఘం కార్యదర్శి సప్పా రమణ, ఐఎఫ్‌టియు రాష్ట్ర నాయకులు కోరాడ అప్పారావు, ఎఐకెఎంఎస్ జిల్లా అధ్యక్షులు జె సత్తిబాబు, ఐఎఫ్‌టియు జిల్లా కోశాధికారి దినేష్ బాబు, జిల్లా కార్యదర్శి ఎస్.కిరణ్ కుమార్, సిపిఐ నగర కార్యదర్శి వి.కొండలరావు, ఎద్ద లక్ష్మి, స్నేని, రమణమ్మ, భద్ర రావు తదితర నాయకులు కార్మికులు పాల్గొన్నారు.


కార్మిక, రైతు సంఘాల నిరసన ప్రదర్శన

ప్రభుత్వ పాఠశాలలను రక్షించాలి

యుటిఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రసాద్

ప్రజాశక్తి - నిడదవోలు

ప్రభుత్వ పాఠశాలలను రక్షించాలని, దీని కోసం ఉపాధ్యాయులంతా నడుం బిగించాలని యుటిఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కెఎస్ఎస్.ప్రసాద్ పిలుపునిచ్చారు. యుటిఎఫ్ జిల్లా మహాసభ నిడదవోలు కాపు కళ్యాణ మండపంలో జరిగింది. యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు పి.జయకర్, ప్రధాన కార్యదర్శి ఎ.షరీఫ్ నేతృత్వంలో జరిగిన ఈ మహా సభలో ప్రసాద్ ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. రాష్ట్ర వ్యాప్తంగా విద్యా వ్యవస్థలో పరిణామాలు శరవేగంగా మారుతున్నాయన్నారు. ప్రభుత్వ విధానాలు ప్రభుత్వ పాఠశాలల ఉనికికే గొడ్డలిపెట్టుగా మారుతున్నాయన్నారు. ప్రభుత్వ పాఠశాలలు తగ్గిపోతే సమాజంలో పేద పిల్లలకు అన్యాయం జరిగినట్టేనన్నారు. రోజు రోజుకూ ఉపాధ్యాయుల సంఖ్య కూడా తగ్గిపోతోందన్నారు. ఇది డిఎస్సి అభ్యర్థుల ఆశలపై నీళ్లు జల్లినట్లేనన్నారు. ప్రభుత్వ విద్యారంగాన్ని కాపాడే దిశగా త్వరలో జరగబోయే రాష్ట్ర స్థాయి యుటిఎఫ్ స్వర్ణోత్సవాల్లో ప్రణాళికలు తీసుకుంటామని తెలిపారు.

ఈ కార్యక్రమంలో పాల్గొన్న శాసన మండలి మాజీ ఫ్లోర్ లీడర్ విఠలపు బాలసుబ్రహ్మణ్యం మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రభుత్వ విద్యా రంగం ప్రమాదంలో పడుతోందని హెచ్చరించారు. ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు దీనిపై ఆలోచించాలన్నారు. పిడిఎఫ్ ఎంఎల్‌సి అభ్యర్థి బొర్రా గోపిమూర్తిని గెలిపించాలని కోరారు. విద్యా వ్యవస్థపై సామాజిక స్పృహ ఉన్న వ్యక్తి గోపిమూర్తి అని అన్నారు. యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎన్.అరుణకుమారి మాట్లాడుతూ ప్రభుత్వం మారినా విద్యా వ్యవస్థలో బోధనేతర పనుల ఒత్తిడి మారలేదన్నారు. యాప్‌ల యాతనతో ఉపాధ్యాయులు సతమతమవ్వుతున్నారన్నారు. యాప్‌ల వల్ల బోధనా సమయం హరించుకు పోతుందన్నారు. జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జయకర్, షరీఫ్ మాట్లాడుతూ నూతన పిఆర్‌సి కమిషన్‌ను వెంటనే వేయాలని, ఐఆర్‌ను ప్రకటించాలని, బకాయి డిఎలు చెల్లించాలని, పిఆర్‌సి ఎరియర్స్ వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు.


మహాసభలో మాట్లాడుతున్న మాజీ విఠపు బాలసుబ్రహ్మణ్యం

యుటిఎఫ్ జిల్లా అధ్యక్షునిగా జయకర్, ప్రధాన కార్యదర్శిగా షరీఫ్

యుటిఎఫ్ జిల్లా మహాసభలో నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. రాష్ట్ర కార్యదర్శి సుభాషిణి ఎన్నికల అధికారిగా, మరో రాష్ట్ర కార్యదర్శి మనోహర్ సహాయకారిగా వ్యవహరించారు. జిల్లా అధ్యక్షునిగా పి.జయకర్, ప్రధాన కార్యదర్శిగా ఎ.షరీఫ్ మరోసారి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. గౌరవ అధ్యక్షులుగా వీడి గంగాధర్, ఉపాధ్యక్షులుగా ఐ.రాం బాబు, ఎం.విజయగౌరి, కోశాధికారిగా ఇవివిఎస్ఎస్ .ప్రసాదరావు, జిల్లా కార్యదర్శులుగా ఇ.శ్రీమణి, సిహెచ్ఎస్.మనోహరకుమార్, పి.శ్రీనివాసమూర్తి, కె.నాగ భూషణం, వి.వెంకటరమణ, సిహెచ్.దయా నిధి, చిలుకూరి శ్రీనివాసరావు, ఎన్.రవిబాబు, డి.మనోజ్‌కుమార్, కె.రమేష్‌బాబు, ఎన్.భవాని, వివి.నర్సారెడ్డి, ఆడిట్ కమిటీ కన్వీనర్‌గా ఎం.శ్రీనివాస్, రాష్ట్ర కౌన్సిలర్లుగా రూపస్‌రావు, సాకా అనిత, భాస్కరరావు, వెంకటరాముడు, వెంకటేశ్వరరావు ఎన్నికయ్యారు. యుటిఎఫ్ సాంస్కృతిక దళం ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి.


అధ్యక్షుడు జయకర్, ప్రధాన కార్యదర్శి షరీఫ్

పిడిఎఫ్ ఎంఎల్‌సి అభ్యర్థి గోపిమూర్తి విస్తృత ప్రచారం

ప్రజాశక్తి - కాకినాడ

ఉద్యోగ, ఉపాధ్యాయ, అధ్యాపక సంఘాలు బలపరిచిన పిడిఎఫ్ ఉపాధ్యాయ నియోజకవర్గ ఎంఎల్‌సి అభ్యర్థి బొర్రా గోపిమూర్తి మంగళవారం నగరంలో విస్తృత ప్రచారం నిర్వహించారు. పలు ప్రభుత్వ, ప్రయివేటు విద్యాసంస్థలను సందర్శించి ఉపాధ్యాయులను కలుసుకున్నారు. మొదటి ప్రాధాన్యత ఓటును తనకు వేసి గెలిపించాలని అధ్యాపకులు, ఉపాధ్యాయులను కోరారు. విద్యా రంగ సమస్యలు పట్ల శాసన మండలిలో ప్రస్తావిస్తానని తెలిపారు. ఉపాధ్యాయ ఉద్యమాలకు అండగా నిలుస్తానని, ప్రభుత్వ రంగాలు కాపాడడానికి నిజాయితీగా పోరాడతానని ఓటర్లకు హామీ ఇస్తూ ప్రచారంలో పాల్గొన్నారు. 16 హైస్కూల్స్, ఒక జూనియర్ కళాశాల, పీజీ సెంటర్‌ను సందర్శించి అక్కడ సమస్యలను అడిగి తెలుసుకున్నారు. గోపిమూర్తి వెంట యుటిఎఫ్, జానవిజ్ఞాన వేదిక నాయకులు, పెన్షనర్స్ అసోసియేషన్ నాయకులు, కాంటాక్ట్ ఆధ్యాపక సంఘ నాయకులు పాల్గొని మద్దతు తెలిపారు.


ఓట్లు అభ్యర్థిస్తున్న పిడిఎఫ్ అభ్యర్థి గోపిమూర్తి

ఘనంగా రాజ్యాంగ దినోత్సవం

ప్రజాశక్తి - యంత్రాంగం

భారత రాజ్యాంగం ఆమోదం పొంది 75 ఏళ్లు అయిన సందర్భంగా జిల్లాలో రాజ్యాంగ దినోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బిఆర్.అంబేద్కర్ విగ్రహాలకు, చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. రాజ్యాంగ ప్రతిజ్ఞను చేయించారు.


రాజమహేంద్రవరం రూరల్ కలెక్టరేట్ సమావేశ మందిరంలో భారత రాజ్యాంగ దినోత్సవాన్ని కలెక్టర్ పి.ప్రశాంతి, డిఆర్ఒ టి.సీతారామమూర్తి, జిల్లా అధికారులతో కలిసి ఘనంగా నిర్వహించారు. తొలుత అంబేద్కర్, గాంధీ చిత్రపటాలకు పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం వివిధ పోటీల్లో విజేతలకు బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ముఖ్య ప్రణాళిక అధికారి డి.అప్పలకొండ, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి ఎస్.మాధవరావు, డిఇఒ కె.నరసింహారావు, అర్బన్ ఆర్ఐ దిలీప్ కుమార్ పాల్గొన్నారు.

దివాన్ చెరువు విజేస్ ఫార్మసీ కళాశాలలో ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో 75వ రాజ్యాంగ దినోత్సవాన్ని నిర్వహించారు. ప్రిన్సిపల్ డాక్టర్ డి.నరేంద్ర రాజ్యాంగాన్ని గురించి వివరించారు. ఈ కళాశాల సెక్రటరీ, కరస్పాండెంట్ డాక్టర్ ఎన్‌వివి.జగన్మోహన్‌రెడ్డి, ఎన్ఎస్ఎస్ పిఒ డాక్టర్ బి.సునీల్‌కుమార్ పాల్గొన్నారు.

రాజమహేంద్రవరం ఒఎన్‌జిసి అసెట్‌లో 75వ 'సంవిధాన్ దివస్' గోదావరి భవన్‌లోని బేస్ కాంప్లెక్స్‌లో ఘనంగా నిర్వహించారు. ఎవి.అప్పారావు రోడ్డు నుంచి బేస్ కాంప్లెక్స్ వరకూ వాక్‌థాన్ నిర్వహించారు. 200 మంది ఒఎన్‌జిసి ఉద్యోగులు, కేంద్రీయ విద్యాలయ విద్యార్థులు పాల్గొన్నారు. రిటైర్డ్ ఐఎఎస్ అధికారి రామచంద్రు తేజావత్ మాట్లాడారు. గ్రూప్ జనరల్ మేనేజర్ (ప్రొడక్షన్) జయంత్ కుమార్, హెడ్ ఫార్వర్డ్ బేస్ పివిఎస్.ప్రసాద్, జనరల్ మేనేజర్ (జియాలజీ), ఎఐఎస్‌సిఎస్‌టిఇడబ్ల్యూఎ చైర్మన్ కొమ్ము సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

డిఇఒ కార్యాలయంలో...

జిల్లా విద్యాశాఖ అధికారి కార్యాలయంలో రాజ్యాంగ దినోత్సవాన్ని నిర్వహించారు. డిఇఒ కె.వాసుదేవరావు అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యాలయ సిబ్బందితో కలిసి రాజ్యాంగ ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో డిఇఒ కార్యాలయ ఎడి వెంకట్రాజు, సూపరింటెండెంట్‌లు నాగేశ్వరావు, రాజకుమారి తదితరులు పాల్గొన్నారు.


గోపాలపురంలో...


ఉండ్రాజవరంలో...


ఆర్ట్స్ కళాశాలలో డాక్టర్ బిఆర్.అంబేద్కర్ సెమినార్ హాల్లో రాజ్యాంగ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కళాశాల ఆవరణలో అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ముఖ్యఅతిథిగా జిల్లా న్యాయ సేవాధికారి సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి కె.ప్రకాష్‌బాబు హాజరయ్యారు. అనంతరం వివిధ పోటీల్లో విద్యార్థులకు బహుమతులు అందించారు.

గోపాలపురం మండల పరిషత్ ప్రాథమిక ప్రత్యేక పాఠశాల ఇన్‌ఛార్జి హెచ్ఎం మల్లిపూడి హితవర్షిణి అధ్యక్షతన రాజ్యాంగ దినోత్సవాన్ని నిర్వహించారు. విద్యార్థులో ప్రతిజ్ఞ చేయించారు. ఉపాధ్యాయులు ఎ.వెంకటేశులు, రాజేష్, వెంకటరమణ, అంబేద్కర్ యూత్ సభ్యులు పాల్గొన్నారు. **తాళ్లపూడి** శ్రీ పనస పద్మ రాజారావు జడ్‌పి ఉన్నత పాఠశాలలో జరిగిన కార్యక్రమానికి ఎఎస్ఒ జోడాల వెంకటేశ్వరరావు హాజరయ్యారు. వ్యాసరచన పోటీల విజేతలకు బహుమతులు అందించారు. తాళ్లపూడి పంచాయతీ కార్యాలయంలో గ్రామ కార్యదర్శి వీరన్న ఆధ్వర్యంలో అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. **చాగల్లు** జడ్‌పిహెచ్ఎస్ పాఠశాలలో రాజ్యాంగ ప్రతిజ్ఞను ఇన్‌ఛార్జి హెచ్ఎం రాళ్లపల్లి వరప్రసాదరావు విద్యార్థులతో చేయించారు. స్కూల్ కమిటీ చైర్మన్ కోటారు గోపాలకష్ణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. అలాగే గ్రంథాలయాలు, కళాశాలల్లో రాజ్యాంగ దినోత్సవాన్ని నిర్వహించారు. **ఉండ్రాజవరంలో** అన్ని ప్రభుత్వ కార్యాలయాలు, విద్యాసంస్థల్లో రాజ్యాంగ దినోత్సవాన్ని నిర్వహించారు. తాడిపర్రు అమత సరోవర్ చెరువు వద్ద ఎంపిడిఒ వివివి.రామారావు ఆధ్వర్యంలో అంబేద్కర్, గాంధీ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. సర్పంచ్ కరుటూరి నరేంద్రబాబు తదితరులు పాల్గొన్నారు. **కడియం** మండలం పొట్టిలంకలో అంబేద్కర్ యువజన సంఘం, జై భీమ్ యూత్ అధ్యర్యంలో రిపబ్లికన్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నక్కా వెంకట రత్నరాజు అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులిర్పంచారు. ఈ కార్యక్రమంలో బడుగు సత్తిబాబు, నక్క చంటి బాబు, అంబటి రాజారత్నం బెలమెన్ శివాజీ తదితరులు పాల్గొన్నారు. **తాళ్లపూడి** మండలం రాగోలపల్లి ఎంపిపి పాఠశాల హెచ్ఎం దున్నా దుర్గారావు ఆధ్వర్యంలో రాజ్యాంగ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, పాఠశాల సిబ్బంది కుమారి, వరలక్ష్మి విద్యార్థులు పాల్గొన్నారు. గజ్జరంలో సర్పంచ్ డాక్టర్ గండి రాంబాబు అంబేద్కర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. పంచాయతీ కార్యదర్శి వెంకటేశ్వరమ్మ, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు. **నిడదవోలు** ఎస్‌విడి మహిళా డిగ్రీ కళాశాల, చర్చిపేట అంబేద్కర్ చౌక్ వద్ద, డాక్టర్ అంబేద్కర్ మల్టీపర్పస్ కమ్యూనిటీ హాల్ వద్ద కెవిపిఎస్ ఆధ్వర్యంలో రాజ్యాంగ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి జువ్వల రాంబాబు మాట్లాడారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం రాజ్యాంగాన్ని బలహీన పరుస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో బొచ్చా కృష్ణ. దాకే అబ్బులు తదితరులు పాల్గొన్నారు. **దేవరపల్లి** బిహెచ్ఎస్ఆర్, విఎల్ఎం డిగ్రీ కళాశాల, ఎంపిడిఒ కార్యాలయంలో ఎంపిపి కెవికె.దుర్గారావు అధ్యక్షతన రాజ్యాంగ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కళాశాల చైర్మన్ దొడ్డిగర్ల సువర్ణరాజు, పిడిఎఫ్ ఎంఎల్‌సి ఐ.వెంకటేశ్వరరావు పాల్గొన్నారు. రాజ్యాంగ విశిష్టత, అంబేద్కర్ కృషిని వివరించారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ వేణుగోపాల్‌రెడ్డి, ఎంఇఒ తిరుమల దాసు, అప్పారావు వార్డు సభ్యులు పాల్గొన్నారు. **నల్లజర్ల** శాఖ గ్రంథాలయంలో నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా అభివృద్ధి కమిటీ చైర్మన్ జి.సుశీల హాజరై అంబేద్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఎం.రవికుమార్, జి.అశోక్, లైబ్రేరియన్ ఎవి.రమణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. **సీతానగరం** పువ్వాడ సత్యమాంబ మెమోరియల్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జాతీయ రాజ్యాంగ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఉపాధ్యాయులు రాజ్యాంగ ప్రవేశిక చదివి, విద్యార్థులతో కలిసి ప్రతిజ్ఞ చేశారు. వివిధ పోటీల్లో విజేతలకు ఇన్‌ఛార్జి హెచ్ఎం కన్నూరి సతీష్‌బాబు ఆధ్వర్యంలో బహుమతులు అందించారు. పీడీ సింహాద్రి, ఉపాధ్యాయులు శంకర్‌రావు, బ్రహ్మాజీ, ఉమాదేవి, తమ్మయ్య, ముస్తఫా, పుష్ప సరళ, శ్రీనివాస్, పాల్గొన్నారు. **కోరుకొండ** మండల పరిషత్ కార్యాలయంలో రాజ్యాంగ దినోత్సవాన్ని నిర్వహించారు. అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ బి.అశోక్‌కుమార్, ఇఒపిఆర్‌డి బి.మహేశ్వరప్రతాప్, ఎంఇఒ కుసలవ దొర తదితరులు పాల్గొన్నారు.


డిఇఒ కార్యాలయంలో...


కలెక్టరేట్‌లో ప్రతిజ్ఞ చేస్తున్న కలెక్టర్ ప్రశాంతి తదితరులు

కార్టూ'నిజం'



నిబంధనలు పాటించకుంటే చర్యలు

డిఎం అండ్ హెచ్‌ఒ వెంకటేశ్వరావు

ప్రజాశక్తి -రాజమహేంద్రవరం రూరల్

నిబంధనలు పాటించని ఆసుపత్రులపై చర్యలు తప్పవని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి వెంకటేశ్వరరావు హెచ్చరించారు. వైద్య ఆరోగ్య శాఖలోని గణాంక విభాగంలో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భగా ఆయన మాట్లాడారు. ప్రయివేటు ఆసుపత్రులు, నర్సింగ్ హోమ్‌లకు అన్ని అనుమతులూ ఉండాలన్నారు. క్లినిక్స్, ల్యాబ్స్, డయోగ్నస్టిక్స్ సెంటర్స్, ఫిజియోథెరఫీ క్లినిక్‌లు అనుమతుల కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ప్రతి ఆసుపత్రి, డయోగ్నస్టిక్స్ సెంటర్లలో ఏ పరీక్షలకు ఎంత ఫీజు వసూలు చేస్తున్నారో ధరల పట్టికను నోటీస్ బోర్డులో ఉంచాలన్నారు. గణాంక అధికారి కుమారస్వామి మాట్లాడుతూ పౌర రిజిస్ట్రేషన్ వ్యవస్థ సవరణ చట్టం ప్రకారం అన్ని ప్రైవేట్ ఆసుపత్రులు జననాలు, మరణాలు, నిశ్చల జననాలను ఆలస్యం చేయకుండా సకాలంలో నమోదు చేయాలన్నారు. తప్పుడు నివేదికలను అందిస్తే చర్యలు తప్పవన్నారు. ఆసుపత్రుల యాజమాన్యాలు తనిఖీ బృందాలకు సహకరించాలన్నారు. ఈ సమావేశంలో అధికారులు నాగు, వసుధ మిశ్రా, జానకి తదితరులు పాల్గొన్నారు.

పనుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు

ప్రజాశక్తి -రాజమహేంద్రవరం రూరల్

పనుల పురోగతిలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని కలెక్టర్ ప్రశాంతి హెచ్చరించారు. మంగళవారం కలెక్టరేట్ సమావేశం మందిరంలో జిల్లా స్థాయి ప్రగతి లక్ష్యలపై జిల్లా, డివిజన్, మండలం స్థాయి అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. గృహ నిర్మాణం, డ్వామా, అంగన్‌వాడీ కేంద్రాల పనులు, నైపుణ్య సర్వే, శిక్షణ కార్యక్రమాలు, ధాన్యం సేకరణ, పిజిఆర్ఎస్, నీటి తిరువా పన్ను వసూళ్లు, ఇతర రెవెన్యూ సమస్యలు, ఎంఎస్ఎంఇ సర్వే తదితర అంశాలపై కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లాలో రెండవ దశ 100 రోజుల గృహ నిర్మాణ పనుల లక్ష్య సాధనలో 4,875 ఇళ్ల నిర్మాణాలకు ఇప్పటి వరకు 1,336 ఇళ్ల నిర్మాణ పనులు పూర్తి చేశామన్నారు. మిగిలిన లక్ష్యాలు డిసెంబర్ చివరి నాటికి పూర్తి చేయాలన్నారు. ప్రతివారం 1,232 ఇంటి నిర్మాణాలు పూర్తి చేయాల్సి ఉంటుందన్నారు. ఈ వారంలో 321 పూర్తి చేసినట్లు తెలిపారు. వీటిపై ఎంపిడిఒ, ఇతర సమన్వయ శాఖల అధికారులతో ప్రత్యేక దష్టి పెట్టాలన్నారు.

బిఎల్‌ఒలు పోలింగ్ కేంద్రాల పరిధిలో 18 ఏళ్లు నిండిన వారిని గుర్తించి ఓటర్లుగా నమోదు చేయాలన్నారు. ఈ మేరకు కళాశాలల్లో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. ఉపాధిలో నూరుశాతం లక్ష్యాలు సాధించాలన్నారు. డిసెంబర్ చివరి నాటికి 44 లక్షల పని దినాలు లక్ష్యం కాగా ఇప్పటి వరకు 40.12 లక్షలు (91.22 శాతం) సాధించారన్నారు.

జిల్లాలో ధాన్యం కొనుగోలుకు సంబంధించి ఇప్పటి వరకు 13,992 మంది రైతుల నుంచి 1,11,260.96 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని 187 ఆర్ఎస్‌కెల ద్వారా కోనుగోలు చేశామన్నారు. రూ.153.56 కోట్లను రైతుల బ్యాంకు ఖాతాలకు జమేశామన్నారు. ఈ సమావేశంలో మున్సిపల్ కమిషనర్ కేతన్ గార్గ్, డిఆర్ఒ టి.సీతారామ్మూర్తి, డిఎల్‌డిఒ పి.వీణాదేవి, ఐసిడిఎస్ పీడీ కె.విజయకుమారి, జిల్లా హౌసింగ్ అధికారి శివజ్యోతి, ఇన్‌ఛార్జి జిల్లా పంచాయతీ అధికారి ఎం.నాగలత, జిల్లా పరిశ్రమల శాఖ అసిస్టెంట్ మేనేజర్ ప్రదీప్ కుమార్, డ్వామా పీడీ ఎ.నాగమల్లేశ్వరరావు పాల్గొన్నారు.



సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రశాంతి



నిరసన తెలుపుతున్న ఎల్ఐసి ఎంప్లాయీస్ యూనియన్ నాయకులు

ఎల్ఐసి యూనియన్ నిరసన

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ కార్మిక, రైతు సంఘాలు చేపట్టిన నిరసనలకు ఆలిండియా ఇన్సూరెన్స్ ఎంప్లాయిస్ యూనియన్ మద్దతు తెలిపింది., రాజమండ్రి డివిజన్ పరిధిలో ఉన్న అన్ని ఎల్ఐసి కార్యాలయాల వద్ద భోజన విరామ సమయంలో, నిరసన ప్రదర్శనలు నిర్వహించినట్లు యూనియన్ ప్రధాన కార్యదర్శి ఎం.కోదండరామ్ తెలిపారు. మోరంపూడి ఎల్ఐసి డివిజనల్ కార్యాలయం వద్ద జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షులు, జి.శ్రీనివాస్, సంయుక్త కార్యదర్శి పిఎస్ఎన్.రాజు, మహిళా కన్వీనర్ శిరీష, రామలక్ష్మి, నాయకులు ఎకె.విశ్వనాథ్, జిలానీ, శిరీష్ కుమార్, రమేష్ బాబు, దొరబాబు, పూర్ణచంద్ర రావు, రామకృష్ణ, మోహనకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

ప్రజాశక్తి - పిఠాపురం

పట్టణంలోని బైపాసు రోడ్డులో మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక వ్యక్తి మృతి చెందగా, ముగ్గురు గాయాలపాలయ్యారు. పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం.. మండలంలోని చిత్రాడ గ్రామానికి చెందిన పి.దుర్గాప్రసాద్ భార్య సమత, తల్లి సాయికుమారి, ఏడాది లోపు చిన్నారితో కలిసి మోటారు సైకిల్‌పై గొల్లప్రోలు మండలం తాటిపర్తి అపర్ణదేవి ఆలయానికి వెళ్లారు. తిరిగి వస్తుండగా పిఠాపురం జాతీయ రహదారి సీతయ్యగారితోట సమీపంలో ముందు వెళ్తున్న గుర్తు తెలియని వాహనాన్ని ఢీ కొట్టాడు. దీంతో కిందప డిపోయిన దుర్గాప్రసాద్ అక్కడికక్కడే మృతిచెందగా, మిగిలిన ముగ్గురు గాయాలపాలయ్యారు. వీరిని పిఠాపురం ప్రభుత్వాసుపత్రి తరలించి ప్రాథమిక వైద్యం అనంతరం మెరుగైన వైద్యం నిమిత్తం కాకినాడ జిజిహెచ్‌కు తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి మృతి

ప్రజాశక్తి - గండేపల్లి

జగ్గంపేట మండలం కొత్తూరు రోడ్డులో శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో అదే మండలం సీతారాంపురం గ్రామానికి చెందిన చింతల శ్రీను(45) గాయపడ్డాడు. క్షతగాత్రుడిని గండేపల్లి మండలం నీలాద్రి రావు పేట శివారున ఉన్న ఓ ప్రయివేటు ఆసుపత్రికి తరలించారు. నాటి నుంచి చికిత్స పొందుతున్న ఆ వ్యక్తికి మంగళవారం శస్త్ర చికిత్స చేసేందుకు ఆపరేషన్ థియేటర్‌లోకి తీసుకెళ్లారు. లోనికి తీసుకెళ్లిన అర్థ గంటలోపే ఆ వ్యక్తి గుండెపోటుకు గురియై మృతి చెందినట్లు వైద్యులు కుటుంబ సభ్యులకు వెల్లడించారు. అయితే ఆస్పత్రి నిర్లక్ష్యం వల్లే తమ కుటుంబీకుడు మృతి చెందాడని కుటుంబ సభ్యులు, బంధువులు ఆరోపించారు. తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

ఇసుక లారీ స్వాధీనం

ప్రజాశక్తి - ఆత్రేయపురం

ఎటువంటి అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుక తరలిస్తున్న లారీని పోలీసులు స్వాధీన పరచుకుని కేసు నమోదు చేశారు. మండలంలోని తాడిపూడి గ్రామంలో మంగళవారం ఇసుకను తరలిస్తున్న లారీని ఎస్ఐ ఎస్.రాము తనిఖీలు చేశారు. ఇసుక తరలింపునకు ఎటువంటి అనుమతి పత్రాలు లేకపోవడంతో లారీని సీజ్ చేసి స్టేషన్‌కు తరలించారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

400 లీటర్ల బెల్లపు ఊట ధ్వంసం

ప్రజాశక్తి - పెద్దాపురం

ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని పాత సూరంపాలెం గ్రామంలో మంగళవారం నిర్వహించిన దాడుల్లో సారా తయారీకి సిద్ధంగా ఉంచిన 400 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేసినట్లు ఎక్సైజ్ సిఐ కెవివిడి.అర్జునరావు తెలిపారు. అలాగే పెద్దాపురం మండలం చంద్రమాంపల్లి గ్రామంలో లీటరు సారా స్వాధీనం చేసుకుని ఒక మహిళను అరెస్టు చేసి కోర్టులో హాజరుపర్చినట్లు తెలిపారు. ఈ దాడుల్లో ఎక్సైజ్ ఎస్ఐలు పి.చిట్టిబాబు, ప్రసాదరావు, సిబ్బంది పాల్గొన్నారు.

చెరువులో స్నానానికి దిగిన వ్యక్తి మృతి

ప్రజాశక్తి - కోరుకొండ

చెరువులో స్నానానికి దిగి వ్యక్తి మృతి చెందిన ఘటన కోరుకొండ మండలం శ్రీరంగపట్నంలో మంగళవారం చోటు చేసుకుంది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల మేరకు శ్రీరంగపట్నం గ్రామంలోని చెరువులో రాపేటి శ్రీనివాసరావు(40) స్నానానికి దిగాడు. ప్రమాదవశాత్తు మతి చెందాడని పోలీసులు తెలిపారు. మతదేహాన్ని పోస్టుమార్టమ్ నిమిత్తం రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

నూరు శాతం ఉత్తీర్ణత సాధించాలి

ప్రజాశక్తి -రాజమహేంద్రవరం రూరల్

ఇంటర్‌లో నూరు శాతం ఉత్తీర్ణత సాధించేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ పి.ప్రశాంతి అధ్యాకులకు సూచించారు. మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఇంటర్మీడియట్ విద్య త్రైమాసిక పరీక్షా ఫలితాలపై జిల్లాలోని జూనియర్ కళాశాల ప్రిన్సిపల్స్‌తో కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జూనియర్ కళాశాల అధ్యాపకులు మెరుగైన ఫలితాలు సాధించేలా నిబద్ధతతో పని చేయాలన్నారు. చదువులో వెనుకబడి ఉన్న విద్యార్థులను గుర్తించి సబ్జెక్టులు వారీగా బోధించాలన్నారు. రాబోయే అర్థ సంవత్సరం పరీక్షల్లో నూరు శాతం ఉత్తీర్ణత ఉండేలా కషి చేయాలన్నారు. విద్యార్థులు కళాశాలకు ప్రతి రోజూ హాజరయ్యేలా తల్లిదండ్రులతో మాట్లాడాలన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ కళాశాలల వారీగా సమీక్షించి వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సమావేశంలో జిల్లా ఒకేషనల్ విద్య అధికారి జెవిఎస్ఎస్.సుబ్రహ్మణ్యం, ఆర్ఐఒ ఎన్ఎస్‌వివిఎల్. నరసింహం పాల్గొన్నారు.



ప్రిన్సిపల్స్ సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రశాంతి

అధికారుల సూచనలతో అధిక దిగుబడి

ప్రజాశక్తి - తాళ్లపూడి

అధికారుల సూచనలు, సలహాలు తీసుకుంటూ సాగు చేస్తే అధిక దిగుబడితో పాటూ లాభాలను అందుకోవచ్చని పంట కోత ప్రయోగాల ఉపగణాంక అధికారులు శ్యాం ప్రసాద్, సోమరాజు అన్నారు. తాడిపూడిలో మంగళవారం వరి, మినుము పంటలకు సంబంధించి పంట కోత ప్రయోగాలను నిర్వహించారు. వరి పంట ఎకరాకు 35 బస్తాలు, మినుము 6 క్వింటాళ్లు దిగుబడి వచ్చినట్లుగా గుర్తించారు. ఈ సందర్భంగా మండల గణాంక అధికారి జోడాల వెంకటేశ్వరరావు మాట్లాడుతూ మండలంలో నిర్దేశించిన పంట కోత ప్రయోగాలు డిసెంబర్ 10లోగా పూర్తి చేయాల్సి ఉందన్నారు. రైతులంతా ప్రయోగాల జరిగే ప్రదేశానికి వచ్చి దిగుబడులు తెలుసుకోవాలని అన్నారు. దీని వల్ల దిగుబడిపై అవగాహన వస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో రైతులు జి.వెంకట రమణ, ఎస్.గంగాధర్, వ్యవసాయ సహాయకులు ఈశ్వర్, భార్గవ్, ఇన్సూరెన్స్ ఏజెంట్లు పోసి బాబు, శ్రీనుబాబు తదితరులు పాల్గొన్నారు.



మందులు అందిస్తున్న నిర్వాహకులు

ఎస్ఎంఎఫ్‌జి ఆధ్వర్యంలో మెడికల్ క్యాంప్

ప్రజాశక్తి - కడియం

వైద్య ఖర్చులు భరించలేని నిరుపేదల కోసం గ్రామీణ ప్రాంతాల్లో ఎస్ఎంఎఫ్‌జి గ్రామ శక్తి బ్యాంక్ ఆధ్వర్యంలో ప్రతి మూడు నెలలకు మెడికల్ క్యాంపులు నిర్వహిస్తున్నామని సీనియర్ మేనేజర్ కె.విక్రమ్ తెలిపారు. కడియంలో స్థానిక కల్యాణ మండపంలో వెలుగుబంటి యూత్ ఆధ్వర్యంలో మంగళవారం ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఇఎన్‌టి, ఆర్థోపెడిక్, జనరల్ విభాగాలకు చెందిన సీనియర్ వైద్యులు సేవలందించారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ వెలుగుబంటి నాని, ఎస్ఎంఎఫ్‌జి బ్రాంచ్ మేనేజర్ కొత్తూరి రంగ, డాక్టర్ తేజస్విని, డాక్టర్ శ్రీ వర్ధన్, డాక్టర్ మేరీ గ్రేస్, ప్రాజెక్ట్ కో-ఆర్డినేటర్ ఎస్.రాంబాబు, వెలుగుబంటి యూత్ సభ్యులు పాల్గొన్నారు.

నైతిక విలువలతో కూడిన బోధన అవసరం

ప్రజాశక్తి - తాళ్లపూడి

నైతిక విలువలు జోడిస్తూ ఉపాధ్యాయులు బోధనను సాగించాలని ఎంఇఒలు బాలామణి, నెహ్రూజీ అన్నారు. రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా తాళ్లపూడిలోని శ్రీ విజేత హైస్కూల్లో హెచ్ఎం డాక్టర్ జెబి.ప్రమోద్‌కుమార్ ఆధ్వర్యంలో జరిగిన ప్రత్యేక కార్యక్రమానికి ఎంఇఒలు ముఖ్య అతిథులుగా హాజరై మాట్లాడారు. రాజ్యాంగం పట్ల విద్యార్థులకు అవగాహన కల్పించేలా ఇటువంటి కార్యక్రమాలు ఏర్పాటు చేయడం అభినంద నీయమన్నారు. పాఠశాల విద్యార్థులు భారత్ మాత, అంబేద్కర్, తెలుగు తల్లి తదితర వేషధారణతో అలరించారు. వివిధ రంగాలలో నిష్ణాతులైన 15 మందికి పురస్కారాలు అందించి సన్మానించారు. ఎంపిపి జొన్నకూటి పోసిరాజు, ఎంఇఒలు బాలామణి, నెహ్రూజీ, మండల గణాంక అధికారి జోడాల వెంకటేశ్వరరావు, సీనియర్ పాత్రికేయులు అప్పన రాజా, జయ ధ్వని ఎడిటర్ పరస రాధాకష్ణ, ప్రముఖ బ్యాడ్మింటన్ కళాకారుడు అనసూయ నవ తేజ తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధే ధ్యేయం

ప్రజాశక్తి -దేవరపల్లి

గ్రామాల అభివృద్ధే ఎన్‌డిఎ ధ్యేయమని గోపాలపురం నియోజకవర్గం ఎంఎల్‌ఎ మద్దిపాటి వెంకటరాజు అన్నారు. దేవరపల్లి గ్రామంలో భాష్యం స్కూల్ రోడ్డులో ఉపాధి నిధులతో నిర్మించిన సిసి రోడ్డును ఆయన మంగళవారం పరిశీలించారు. ఆయన వెంట టిడిపి మండల అధ్యక్షులు ఆండ్రు అనిల్, నాయకులు జి.హరికృష్ణ, ఉప్పులూరి రాంబాబు, కార్యకర్తలు పాల్గొన్నారు

చేతులను శుభ్రంగా ఉంచుకోవాలి

ప్రజాశక్తి - ఉండ్రాజవరం

చేతులను శుభ్రంగా ఉంచుకోవాలని మండల పారిశుధ్య కో-ఆర్డినేటర్ కత్తుల ప్రకాష్ విద్యార్థులకు సూచించారు. తాడిపర్రు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చేతుల శుభ్రతపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఆహారం తీసుకునే ముందు, మలవిసర్జన తరువాత సబ్బుతో చేతులు కడుక్కోవాలన్నారు. ఎఎన్ఎం శివపార్వతి మాట్లాడుతూ అధిక శాతం అనారోగ్యాలు చేతుల నుండే మొదలవుతాయన్నారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం సరోజిని, వెల్ఫేర్ అసిస్టెంట్ సత్యం, ఉపాధ్యాయులు, పంచాయతీ సిబ్బంది, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.


విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ప్రకాష్

5 వేల మందికి అన్నదానం

ప్రజాశక్తి -దేవరపల్లి

దేవరపల్లి గ్రామంలో గోపాలపురం రోడ్డులో ఉన్న అభయ ఆంజనేయ స్వామి ఆలయం వద్ద మంగళవారం అన్నదానం నిర్వహించారు. సుమారు ఐదు వేలమంది పాల్గొన్నారు. కార్తీక మాసంలో ప్రతి ఏటా మంగళవారం గ్రామంలోని దాతల సహకారంతో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నామనిఆలయ కమిటీ ప్రెసిడెంట్ దోసనపూడి శ్రీనివాసు, వైస్ ప్రెసిడెంట్ రాజు తెలిపారు.

యానాం వార్తలు



సిఐటియు ఆధ్వర్యంలో ధర్నా

ప్రజాశక్తి - యానాం

మోడీ ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక ,రైతు, ప్రజా వ్యతిరేక నిర్ణయాలకు నిరసిస్తూ సిఐటియు ఆధ్వర్యంలో ప్రాంతీయ పరిపాలనాధికారి కార్యాలయం వద్ద కార్మికులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా అధ్యక్షులు జి.దుర్గాప్రసాద్, రాజ్యాంగ పరిరక్షణ వేదిక కన్వీనర్ కెవివి.సత్యనారాయణలు మాట్లాడారు. మోడీ పాలనలో రైతుల ఆత్మహత్యలు రెట్టింపు అయ్యాయని, నిరుద్యోగం పెద్దఎత్తున పెరిగిపోయిందన్నారు. పరిశ్రమల్లో కార్మికులు బానిసలకంటే దారుణమైన రీతిలో పని భారంతో పని చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో పరిస్థితులు దీనికి భిన్నంగా లేవని, ఎన్నికల ముందు ప్రజా సమస్యలపై ఉపన్యాసాలు దంచిన కూటమి నాయకులు అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేయకుండా ఒకరిపై ఒకరు విమర్శలు చేసుకుంటున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో ఇళ్ల వాసు, టి.శ్రీనివాసరావు, సబ్బతి రాంబాబు, తిరికోటి శ్రీనివాసరావు, దాసరి రాజు, తాడిపల్లి మధుబాబు, పి.మణికంఠ, ఆర్.సురేష్, పి.శివకుమార్ పాల్గొన్నారు.

ఘనంగా భారత రాజ్యాంగ దినోత్సవం

ప్రజాశక్తి - యానాం

భారత రాజ్యాంగ దినోత్సవంగా సందర్భంగా యానాంలో మంగళవారం ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీని ఆర్ఎఒ మునిస్వామి ప్రారంభించారు. స్థానిక పాత బస్టాండ్, అంబేద్కర్ సర్కిల్ వద్ద అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా యువజన అధికారి తిర్రి గోపి, ఎన్ఎస్ఎస్ రీజినల్ కోఆర్డినేటర్ చింతపల్లి కృష్ణసుధాకర్, ప్రోగ్రాం ఆఫీసర్లు చల్ల నరేష్, కృష్ణంరాజు, శశికాంత్ వర్మ, వాసంశెట్టి ఆనంద్, మన్నే కిరణ్ పాల్గొన్నారు. అలాగే ఎస్‌సి, ఎస్‌టి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో పాత బస్టాండ్‌లోని అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు పోనుగుమట్ల విష్ణుమూర్తి, గిడ్డి బలరాం, పండు సిద్దార్థకుమార్, దాట్ల దేవదానంరాజు, నక్క వాసుదేవరావు, కోరుకొండ ప్రసాదరావు, సబ్బతి శ్రీనివాసరావు, మెల్లం శ్రీనివాసరావు పాల్గొన్నారు. అలాగే కమలా నెహ్రూ ప్రభుత్వ బాలిక ఉన్నత పాఠశాలలో హెచ్ఎం కెఎన్.లక్ష్మి ఆధ్వర్యంలో రాజ్యాంగ దినోత్సవం ఘనంగా నిర్వహించారు.



వరి రైతులు అప్రమత్తంగా ఉండాలి

ప్రజాశక్తి - అమలాపురం

బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం మూలంగా ఈ నెల 29,30, డిసెంబరు 1, 2 తేదీల్లో వర్షాలు వచ్చే అవకాశం ఉందని జెసి టి.నిషాంతి అన్నారు. ఈ కారణంగా జిల్లాలో వరి రైతులు తమ పంటల ను కాపాడు కునేలా అప్రమత్తం కావాలని మంగ ళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.. ప్రస్తుతం నిలబడి ఉన్న వరి పంట కోతలు కోయరాదని సూచించారు. సాధారణంగా కోతలు కోసి పనులు మీద ఉన్న ధాన్యాన్ని ఉప్పు ద్రావణంతో పిచికారీ చేస్తూ మొలకలు రాకుండా, రంగు మారకుండా జాగ్రత్తలు వహించాలన్నారు. ఇప్పటికే నూర్చిన ధాన్యాన్ని వెంటనే తమకు నచ్చిన మిల్లులకు తరలించి విక్రయించుకునేలా పౌర సరఫరాల శాఖ పూర్తి సహకారాలు అందిస్తుం దన్నారు. రోడ్లపై ఆరబెట్టిన ధాన్యాన్ని కూడా మిల్లులకు ట్యాగింగ్ చేస్తారన్నారు. ధాన్యాన్ని వెంటనే మిల్లులకు తరలించాలని ఆమె సూచించారు. రైస్ మిల్లుల వద్ద నియమించిన కస్టోడియన్ అధికారులు అందుబాటులో ఉండి గోనె సంచులు హమాలీలు రవాణా వసతు లను రైతులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా కల్పిస్తారన్నారు. జిల్లాస్థాయి కమాండ్ కంట్రోల్ రూమ్ లో జిల్లా పౌరసరఫరాల మేనేజర్ జిల్లా పౌరసరఫరాల అధికారి అందుబాటులో ఉండి రైతులకు అన్ని విధాల సహాయ సహకారాలు అందిస్తారని, రైతులు తమకు ఇబ్బంది వచ్చినా వెంటనే మండల జిల్లా స్థాయి కంట్రోల్ రూమ్‌కి ఫోన్ చేస్తే ఆ యొక్క సమస్యకు పరిష్కార మార్గం చూపుతారన్నారు. నూర్పుల సమస్యలను జిల్లా వ్యవసాయ అధికారి దష్టికి తెచ్చి తగు పరిష్కార మార్గాలు కోరాలన్నారు. అల్లవరం, అమలాపురం, ఐ.పోలవరం మండలంలో వరి సాగు తక్కువగా ఉన్నదని ఆమె స్పష్టం చేశారు. రైతులు తుపాను బారి నుండి తమ పంటలను కాపాడుకోవాలని ముందస్తుగా సూచించామని జెసి విజ్ఞప్తి చేశారు.

బోటు రేసు నిర్వహణకు చర్యలు

అమలాపురం : పర్యాటకులకు ప్రకృతి రమణీయతతో కూడిన చక్కటి వాతావరణంలో మానసిక ఉల్లాసాన్ని సాంత్వనను అందించేందుకు ఆత్రే యపురం మండలం లొల్ల లాకుల ఎగువ భాగం (అప్ స్ట్రీమ్)నందు బోటు రేసు నిర్వహణకు సన్నాహాలు చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్ వెల్లడించారు. మంగళవారం స్థానిక కలెక్టరేట్ నందు జిల్లా పర్యాటక కమిటీ ఆధ్వర్యంలో కోనసీమ జిల్లాలో పాశర్లపూడి, ఆదుర్రు గ్రామాల్లోబోటింగ్ టెర్మినల్స్ ఏర్పాటు, కోటిపల్లి నందు టూరిజం రిసార్ట్ ఆపరేషన్ మేనేజ్మెంట్ నిర్వహణ పనులు, ఆత్రేయపురం లొల్ల లాకుల నందు ఫెడల్ బోట్ రేస్ నిర్వహణ అంశాల పురోగతిపై కమిటీ ఆధ్వర్యంలో సమీక్షించారు కార్యక్రమంలో జిల్లా జాయింట్ కలెక్టర్ టి.నిషాంతి, డిఆర్ఒ మదన్ మోహన్ రావు, కొత్తపేట ఆర్‌డిఒ శ్రీకర్ పాల్గొన్నారు.

గ్రామ సభలను సద్వినియోగం చేసుకోవాలి

సామర్లకోట : గత ప్రభుత్వంలో చేపట్టిన భూముల రీ సర్వేలో జరిగిన లోపాలను సరిదిద్దేందుకు నిర్వహిస్తున్న రీ సర్వే గ్రామ సభలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని తహశీల్దార్ కె.చంద్రశేఖర్ రెడ్డి సూచించారు. మంగళవారం మండలంలోని చంద్రంపాలెంలో రీ సర్వే గ్రామసభ తహశీల్దార్ అధ్యక్షతన జరిగింది. భూ యజమానులు, గ్రామ పెద్దలు, ప్రజా ప్రతినిధులు, రాజకీయ పార్టీల నాయకులు గ్రామ సభలో పాల్గొని పలు సమస్యలను అధికారుల దృష్టికి తీసుకొచ్చారు.మొత్తము 33 అర్జీలు వచ్చినట్లు తహశీల్దార్ తెలిపారు.

సైన్స్ సెంటర్ పనులను వేగవంతం చేయాలి

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం రూరల్

జిల్లా సైన్స్ సెంటర్ పనులను త్వరగా పూర్తి చేయాలని ఎపి కాస్ట్(ఆంధ్రప్రదేశ్ కౌన్సిల్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ) మెంబర్ సెక్రెటరీ చలపతిరావు అన్నారు. బొమ్మూరులో సిద్ధమవుతున్న జిల్లా సైన్సు సెంటర్‌ను ఆయన మంగళవారం సందర్శించారు. పెండింగ్ పనులు పూర్తి చేయాలని సిబ్బందికి సూచించారు. అతి త్వరలోనే దీనిని ప్రారంభిస్తామన్నారు. రాజమహేంద్రవరం సైన్సు సెంటరు రాష్ట్రంలోనే అతిపెద్ద సైన్స్ సెంటర్ అన్నారు. నూతన ఆవిష్కరణలు చేసేందుకు విద్యార్థులకు ఇక్కడ అవకాశం కల్పిస్తామన్నారు. సామాన్య ప్రజలు కూడా సందర్శించొచ్చని ప్రాజెక్ట్ కో-ఆర్డినేటర్ మేకా సుసత్యరేఖ తెలిపారు. ఫీల్డ్ ఆఫీసర్ దుర్గయ్య మాట్లాడుతూ ప్రకృతిలో మమేకమవుతా ఇక్కడ సైన్స్ నేర్చుకోవచ్చన్నారు. ఆయన వెంట ఎడ్యుకేషనల్ అసిస్టెంట్ ఎస్.కోమలి,కీర్తి, టెక్నీషియన్ అజయ్ ఉన్నారు.


సిబ్బందికి సూచనలు ఇస్తున్న చలపతిరావు

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ప్రజాశక్తి - సామర్లకోట

స్థానిక 33/11 కెవి విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో విద్యుత్ లైన్లకు చేపట్టే మరమ్మతు పనుల కోసం బుధవారం ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకూ పట్టణంలోని పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఎపిఇపిడిసిఎల్ ఇఇ ఎవిఎన్‌డిఎస్.ప్రభాకర్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. బలుసులపేట, సంత మార్కెట్, ఇందిరా కాలనీ, నీలమ్మ చెరువు, మెహర్ కాంప్లెక్స్, సంగీతరావు పేట, పెద్ద పోస్ట్ ఆఫీస్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని తెలిపారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు తాడిపర్రు విద్యార్థిని ఎంపిక

ప్రజాశక్తి - ఉండ్రాజవరం

ఖోఖో రాష్ట్ర స్థాయి పోటీలకు తాడిపర్రు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏడో తరగతి విద్యార్థిని పి.లక్ష్మీగణేశ్వరి ఎంపికైందని హెచ్ఎం కె.సరోజిని తెలిపారు. జిల్లా స్థాయి పోటీల్లో రాణించడంతో రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైందన్నారు. ఈ సందర్భంగా గణేశ్వరిని సర్పంచ్ కరుటూరి నరేంద్రబాబు, పిఇటి కె.దుర్గ, ఉపాధ్యాయులు, గ్రామ పెద్దలు అభినందించారు.

అక్రమ కేసులు పెడితే ఊరుకోబోము

ప్రజాశక్తి - కోటనందూరు

అక్రమ కేసులు పెడితే చూస్తూ ఊరుకోమని మాజీ మంత్రి దాడిశెట్టి రాజా అన్నారు. మంగళవారం రాజ్యాంగ దినోత్సవ సందర్భంగా బాబాసాహెబ్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. వైసిపి సోషల్ మీడియా ప్రతినిధుల పై అక్రమ కేసులు నమోదు చేయ డాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు. ఎన్ని అక్రమ కేసులు పెట్టిన ఎదుర్కొంటామని అన్నారు. కార్యకర్తలు, నాయకులకు అండగా వైసిపి ఉంటుందన్నారు. ప్రభుత్వం రాజ్యాం గాన్ని అపహస్యం చేస్తుందని అన్నారు. చంద్రబాబు ఆరు నెలలు పరిపాలనను ప్రజలు అసహ్యించుకుంటున్నారని, రాష్ట్రం అంతా పాలన ఒకలాగా ఉంటే తుని నియోజక వర్గంలో మరోలా ఉందన్నారు. పోలీసులు కాకి డ్రెస్ తీసేసి పశువు రంగు బట్టలు ధరించి విధులు నిర్వహిస్తున్నారని విమర్శించారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు బొంగు ఉమారావు, బోడపాటి సతీష్, రాయి మేరీ, అవినాష్, పోతల రమణ పాల్గొన్నారు.

హైరిస్క్ కేసులపై ప్రత్యేక దృష్టి

ప్రజాశక్తి - మామిడికుదురు

హైరిస్క్ ప్రెగ్నెన్సీ కేసులపై ప్రత్యేక దృష్టి పెట్టామని నగరం పిహెచ్‌సి వైద్యాధికారి కెజె.ప్రశా ంత్ తెలిపారు. మొగలి కుదురులో మంగళవారం హైరిస్క్ ప్రెగ్నెన్సీ కేసు పరిశీలించారు మండల పరిధిలో 30 మంది గర్భిణులు ఉన్నా రని, ఐదు హైరిస్క్ ప్రెగ్నెన్సీ కేసులు ఉన్నాయన్నారు. హైరి స్క్ కేసులన్న గర్భిణుల ఇంటికి వెళ్లి వైద్య సేవలు అందిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో కెఎస్.సత్యవతి, ఎఎన్ఎం మల్లీశ్వరి, ఎంఎల్‌హెచ్‌పి ఎం.దీపిక, ఆశ వర్కర్లు సేవలందించారు

ఆట స్థలాలను అభివృద్ధి చేయాలి

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

రాజమహేంద్రవరం నగరంలోని ఆట స్థలాలను అభివృద్ధి చేయాలని డివైఎఫ్ఐ డిమాండ్ చేసింది. ఈ సందర్భంగా డివైఎఫ్ఐ జిల్లా కన్వీనర్ వి.రాంబాబు మాట్లాడారు. నగరంలో నడి బొడ్డున ఉన్న నాగుల చెరువు చెంతన ఉన్న మున్సిపల్ స్టేడియంను అభివృద్ధి చేయాలన్నారు. ఆటలు ఆడుకునేందుకు వచ్చిన క్రీడాకారులకు ఇక్కడ కనీస సదుపాయాలు లేవన్నారు. తాగునీరు, కూర్చోడానికి నీడ, బెంచీలు కరువయ్యాన్నారు మున్సిపల్ కమిసనర్ స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేసాము.

మొక్కలను సంరక్షించాలి

ప్రజాశక్తి- కడియం

నిత్యం మొక్కలను సంరక్షిస్తూ ఉండాలని, మొక్కలతోనే మానవ మనుగడ ముడిపడి ఉందని బుర్రిలంక శ్రీ ఈశ్వర ఫామ్స్ నర్సరీ అధినేత, టివిసి చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ తాడాల విష్ణుచక్రవర్తి అన్నారు. మల్లికార్జున స్వామి ఆలయంలో నిర్వహించిన కేదార గౌరీ వ్రతాల్లో పాల్గొన్న భక్తులకు బిల్వ, జమ్మి, తులసి, ఉసిరి వంటి పెరటి మొక్కలను విష్ణుచక్రవర్తి దంపతులు కుటుంబ సభ్యులతోకలిసి అందించారు. ఈ సందర్భంగా ఈ కార్యక్రమానికి సహరించిన ఆలయ ఉప కార్యనిర్వహణ అధికారి ఆర్.రవణమ్మ, సహాయ కమిషనర్ ఇ.చంద్రశేఖర్ రెడ్డికి ఆయన కతజ్ఞతలు తెలిపారు.

బ్యాడ్మింటన్‌లో గోకవరం విద్యార్థుల విజయం

ప్రజాశక్తి-గోకవరం

రాజమహేంద్రవరంలో విజయ్ బాడ్మింటన్ అకాడమీలో జరిగిన అండర్ -11, 13,19 మేన్స్ అండ్ ఉమెన్స్ డబుల్స్ ఛాంపియన్ షిప్ టోర్నీలో గోకవరం విద్యార్థులు విజయం సాధించారు. మండలంలోని వివిధ పాఠశాలల నుంచి ఈ పోటీలకు హాజరయ్యారు. పలు విభాగాల్లో ప్రతిభ చాటి పతకాలను అందుకున్నారు. అండర్ -11 విభాగంలో సింగిల్స్ విన్నర్‌గా జి.కార్తీక్, అండర్ -11 డబుల్స్ విభాగంలో పి.సాయి గణేష్ పి.చరణ్ తేజ, అండర్ -13 విభాగంలో బెస్ట్ ప్లేయర్స్‌గా బి.వెంకట్ ఆదిత్య , ఒ.సాయి, అండర్ -19లో బెస్ట్ ప్లేయర్‌గా ఎస్.గణేష్ విజయం సాధించారు. వీరిని పలువురు అభినందించారు.

ఫ్యాక్టరీ తెరిపించాలని మోకాళ్లపై ధర్నా

ప్రజాశక్తి - ఏలేశ్వరం, జగ్గంపేట

ఈ నెల 16 న అర్ధాంతరంగా నిలిపివేసిన చిన్నింపేట జీడిపిక్కలు ఫ్యాక్టరీ తెరిపించాలని సిఐటియు ఆధ్వర్యంలో కార్మికులు మోకాళ్లపై కూర్చుని ధర్నా చేపట్టారు. మంగళవారం జరిగిన ఈ ధర్నాలో సిఐటియు ప్రత్తిపాడు మండల కార్యదర్శి రొంగల ఈశ్వరరావు మాట్లాడుతూ ఫ్యాక్టరీ మూసివేయడంతో 409 మంది కార్మికులు రోడ్డున పడ్డారన్నారు. ఫ్యాక్టరీని తెరిపించాలని గత పది రోజులుగా అనేక రూపాల్లో ఆందోళనలు నిర్వహిస్తూ అధికారులు, ప్రజాప్రతినిధుల దృష్టికి సమస్యను తీసుకువెళ్లిన ఫలితం లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం వెంటనే ఫ్యాక్టరీని తెరిపించి కార్మికులకు ఉపాధి కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కార్మిక సంఘ నాయకులు కంట చక్రధర్, కర్రీ రాజా, కాకర ప్రసాద్, వనము దుర్గాప్రసాద్, ఎ.రామదుర్గ, సిహెచ్.గోవింద్, వై.రమేష్, జి.వీరబాబు, ఎస్.జయలక్ష్మి, వై.శివ వరలక్ష్మి, కె.కృష్ణవేణి పాల్గొన్నారు.

ఎంఎల్‌ఎను కలిసిన కార్మికులు

చిన్నింపేట జీడిపిక్కల పరిశ్రమ కార్మికులు ఎంఎల్‌ఎ జ్యోతుల నెహ్రూను కలిశారు. ఈ సందర్భంగా సిఐటియు నాయకుడు రొంగల ఈశ్వరరావు మాట్లాడుతూ అర్థాంతరంగా పరిశ్రమను నిలిపివేయడంతో సుమారు 409 మంది కార్మికుల కుటుంబాలు రోడ్డున పడ్డాయని అన్నారు. ప్రభుత్వమే పరిశ్రమను తీసుకుని నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని ఆయనను కోరారు. దీనిపై ఎంఎల్‌ఎ మాట్లాడుతూ డిసిఎల్‌తో మాట్లాడి కార్మికులకు న్యాయం జరిగేలా చూస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కార్మికులు వీరబాబు, కంట చక్రధర్, కాకరప్రసాద్, ఎ.రామదుర్గ, సిహెచ్.గోవిందు, జి.వీరబాబు, జయలక్ష్మి, దుర్గ, అన్నపూర్ణ పాల్గొన్నారు.


మోకాళ్లపై నిల్చుని నినదిస్తున్న కార్మికులు